ప్రజాశక్తి
శనివారం 28 సెప్టెంబర్ 2024 5 విజయనగరం

## సర్వే ఆఫ్ ఇండియాకు 5 లోగా డేటా అందించాలి

ప్రజాశక్తి-విజయనగరంకోట

వ్యవసాయ, రవాణా, అటవీ, డిఆర్‌డిఎ డ్వామా, పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బి , జలవనరులు తదితర శాఖలవద్ద ఉన్న డేటా ను అక్టోబర్ 5 లోగా సర్వే ఆఫ్ ఇండియావారికి అందజేయాలని జిల్లా కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సర్వే ఆప్ ఇండియా, తిరుపతి ఐఐటి ఆధ్వర్యంలో జియో స్పెసియల్ ప్రమోషన్ అండ్ డెవలప్‌మెంట్ కమిటీ పై సమావేశం జరిగింది. తిరుపతి ఐఐటి సిఇఒ రాజేంద్రన్ పవర్ పాయింట్ ద్వారా డేటా అవసరతపై వివరించారు. సర్వే ఆ ఇండియా ద్వారా డేటా ను తీసుకొని ఆ డేటాను బట్టి ఆయా శాఖల సమస్యలకు సరియైన పరిష్కారాన్ని కనుగొనడానికి చర్యలు తీసుకుంటారని తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్, ప్రొఫెసర్ అభిజిత్, డైరెక్టర్ ఆఫ్ జియో స్పేస్ ఫరీడా, సర్వేశాఖ ఎడి త్రివిక్రమ రావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి తారక రామారావు, మున్సిపల్, స్కిల్ డెవలప్మెంట్ అధికారులు పాల్గొన్నారు.

# డ్రగ్స్‌ను నిర్మూలిద్దాం.. భవిష్యత్తును కాపాడుకుందాం

- నేటి నుంచి భగత్ సింగ్ స్టూడెంట్స్ ఫెస్ట్
- అలరించనున్న కళారూపాలు
- గురజాడ కళాభారతి వేదికగా 3 రోజుల పాటు కార్యక్రమాలు
- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాము, వెంకటేష్

డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్న విద్యార్థినులు

**డ్రగ్స్‌ను నిర్మూలిద్దాం.. భవిష్యత్తును కాపాడుకుందాం అనే నినాదంతో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన శనివారం నుంచి మూడు రోజులు పాటు భగత్‌సింగ్ స్టూడెంట్స్ ఫెస్ట్‌ను నగరంలోని గురజాడ కళాభారతిలో నిర్వహించనున్నారు. నేటి సమాజంలో రోజురోజుకూ మాదక ద్రవ్యాల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో పెడతోవ పడుతున్న యువతకు మత్తుతోనే కాదు ఆనందం, ఆటలు పాటలు, సాంస్కృతిక కళా రూపాలు ద్వారా ఉందని చూపించే ప్రయత్నంలో భాగంగా ఎస్ఎఫ్ఐ భగత్ సింగ్,గాంధీ జయంతి సందర్భంగా ఫెస్ట్ పేరుతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా ఈనెల 28,29,30 తేదీల్లో మూడు రోజులు పాటు నగర ప్రజలను, యువతను ఆకట్టుకునే విధంగా కార్యక్రమాలు నిర్వహించనుంది.**

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రపంచంలో ఏ దేశంలోనూ లేనంత యువత మన దేశంలో ఉంది. కానీ నేటి ఆ యువత డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసై మహిళలపై అత్యాచారాలు వంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతూ పెడతోవ పడుతోంది. అగ్నికి ఆజ్యం తోడైనట్లు పెరుగుతున్న నిరుద్యోగం యువతను పక్కదారి పట్టిస్తోంది. గొప్పగొప్ప ఉన్నత చదువులు చదువుకున్న వారు, తెలివైన విద్యార్థులు చదువు అనంతరం డబ్బులు కోసం మత్తు పదార్థాల రవాణాకు పాల్పడుతున్నారు. ఆ క్రమంలోనే వాటిని సేవించడానికి అలవాటు పడుతూ తమ జీవితాలను, ఆరోగ్యాన్ని నాశనం చేసుకుంటున్నారు. పాఠశాల స్థాయి విద్యార్థుల చేతుల్లో కూడా చాక్లెట్ వచ్చి చేరినంత సులువుగా గంజాయి వచ్చి చేరుతుంది. వీటన్నింటికీ గల కారణం పిల్లలకు, తల్లిదండ్రులకు మధ్య ఉన్న సంబంధాలు అంతకంతకూ తగ్గుతుండడమే. పేదరికం పెరిగిపోవడంతో చాలా మంది తల్లిదండ్రులు వలసలు పోతున్నారు. మధ్యతరగతి, ధనిక కుటుంబాల్లో భార్య, భర్తలు ఇద్దరూ ఉద్యోగస్తులు కావడంతో పిల్లల పర్యవేక్షణకు, వారితో మాట్లాడటానికి తగినంత సమయం కేటాయించడంలేదు. ఒకప్పుడు విద్యార్థులకు విద్యతో పాటు ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉండేవి. అవి వారికి మానసిక ఉల్లాసాన్ని, నైతిక విలువలను అందించేవి. రానురానూ అవి విద్యార్థులకు దూరమౌతున్నాయి. దీంతో విద్యార్థులు చదువు అనంతరం మిగిలిన సమయాన్ని మొబైల్స్‌లోను, మత్తు పదార్థాలకు ప్రేరేపితమై వాటిలోనే ఆనందాన్ని వెతుక్కుంటున్నారు. అందుకనే విజ్ఞానం-వినోదంలోనే డ్రగ్స్‌కు మించిన ఆనందం ఉందంటూ అటు తల్లిదండ్రులను, ఇటు విద్యార్థులను చైతన్యం చేసే కార్యక్రమానికి ఎస్ఎఫ్ఐ శ్రీకారం చుట్టింది. డ్రగ్స్ బారిన పడితే జీవితాలు ఏ విధంగా నాశనం అవుతాయో తెలియజేస్తూ జిల్లా వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో ఫ్లాష్ మాబ్స్ (వీధి నాటకాలు) గత 15 రోజులుగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ముగింపుగా సెప్టెంబర్ 28, 28, 30 మూడు రోజులు పాటు భగత్ సింగ్, గాంధీజీ జయంతి వారోత్సవాల్లో భాగంగా భగత్ సింగ్ స్టూడెంట్స్ ఫెస్ట్‌ను నిర్వహిస్తుంది. ఈ మూడు రోజులు పాటు కళాశాల స్థాయి విద్యార్థులు వారిలో ఉన్న టాలెంట్స్ పాటలు, డాన్స్, నాటికలు, మ్యాజిక్ షో, మ్యూజికల్ ఇనుస్ట్రుమెంట్స్ ప్లే చేయడం వంటి పోటీలు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకొని ఈ కార్యక్రమాల్లో పాల్గొవచ్చు. ఇప్పటికే అనేక మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు.

ఈ కార్యక్రమాలను జయప్రదం చేసేందుకు ఎస్ఎఫ్ఐ నాయకులు ఇప్పటికే ఏర్పాట్లు చేశారు. ప్రతి రోజూ మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 8 గంటలు వరకు ఈ కార్యక్రమాలు జరగనున్నాయి, యువత అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.రాము, సిహెచ్ వెంకటేష్ కోరారు.

**మొదటి రోజు**

నగరంలో శనివారం మధ్యాహ్నం 2 గంటలకు వేలాది మంది విద్యార్థులతో ప్రారంభోత్సవ ర్యాలీ నిర్వహించనున్నారు. అనంతరం డ్రగ్స్ వినియోగం వల్ల నష్టాలు, అమ్మాయిలపై అత్యాచారాలకు కారణాలకు సంబంధించి నాటికలు వేస్తారు. అమ్మాయిల ఆత్మరక్షణకు సంబంధించి కరాటే, కర్రసాము వంటి కార్యక్రమాలు ప్రదర్శిస్తారు.

**రెండోరోజు**

మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా సైంటిఫిక్ టెంపర్‌ను అందించడానికి 50 రకాల ప్రయోగాలతో విద్యార్థులందరినీ అబ్బురపరుస్తూ ఔరా అనేలా సైన్స్ ఎగ్జిబిషన్ విద్యార్థులతోనే చేయించనున్నారు. నాటిక, మరుగుతున్న నూనెలో నుంచి గారెలు తీయడం వంటి కార్యక్రమాలు చేయనున్నారు.

**మూడో రోజు**

ఉత్తరాంధ్ర సాంప్రదాయ కళారూపాలైన పులివేషాలు, తప్పిటిగుళ్ళు, థింసా వంటి కార్యక్రమాలను ప్రదర్శిస్తారు. మేకులపై నడవడం, నిప్పులపై నడవడం, ఉత్తరాంధ్ర సాంప్రదాయ సాంస్కృతిక కార్యక్రమాలు, పులివేషాలు, తప్పెట గుళ్ళు, డ్యాన్స్, పాటలు, థింసా నృత్యం, క్లాసిక్, వెస్ట్రన్ సినిమా పాటలు, జానపదాలు, సోలో, అభ్యుదయ గీతాలు, ఫోక్ పాటలు, నాటికలు, మ్యాజిక్ షో, ఏకపాత్రాభినయం, లఘు నాటికలు, సంగీతం వంటి పోటీలు, కార్యక్రమాలు ఉంటాయి.

## కొలువుదీరిన అధికారులు

కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎక్సైజ్ డిసి బాబ్జీరావు

ప్రజాశక్తి-విజయనగరంకోట

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేపట్టిన సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లాకు బదిలీపై వచ్చిన పలు శాఖల అధికారులు శుక్రవారం తమ కార్యాలయాల్లో బాధ్యతలు చేపట్టారు. అనంతరం జిల్లా కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ను కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి తమ నియామకంపై తెలిపారు. ప్రభుత్వ లక్ష్యాల మేరకు ఆయా శాఖలను సమర్ధవంతంగా నిర్వహించి జిల్లాను అభివృద్ధి పథంలో నడపడంలో తోడ్పడాలని కలెక్టర్ పేర్కొన్నారు. గనుల శాఖ ఉప సంచాలకులుగా ఇ.నరసింహారెడ్డి శుక్రవారం తమ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈయన కాకినాడ జిల్లా నుంచి బదిలీపై ఇక్కడ నియమితులయ్యారు. జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ గా బాబ్జీ రావు, సూపరింటెండెంట్ గా బి.శ్రీనాధుడు బాధ్యతలు చేపట్టారు. శ్రీనాథుడు గతంలో గుంటూరు జిల్లాలో పనిచేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు. బాబ్జీ రావు ఇక్కడే గతంలో చేశారు. ఈ సందర్భంగా వారు జిల్లా కలెక్టర్‌ను కలిశారు. డ్వామా పీడీ ఇ.సందీప్ బాధ్యతలు చేపట్టారు. అనకాపల్లి జిల్లాలో ఆయన ఇప్పటివరకు డ్వామా పీడీగా చేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు.

**స్పెషల్ బ్రాంచ్ సిఐ బాధ్యతలు స్వీకరణ**

జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీసు - 1 గా ఎ.వి.లీలారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం, జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్‌ను మర్యాద పూర్వకంగా కలిసి, పూల మొక్కలను అందజేశారు.

**నెల్లిమర్ల నగర పంచాయతీ కమిషనర్‌గా అప్పలరాజు**

నెల్లిమర్ల : నగర పంచాయతీ కమిషనర్‌గా కె.అప్పలరాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. భీమవరం మున్సిపాలిటీలో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఆయన ఇక్కడికి వచ్చారు. ఇంతవరకు ఇన్‌ఛార్జి బాధ్యతలు నిర్వహించిన మేనేజర్ టివిఎస్ విశ్వేశ్వరరావు బదిలీపై యలమంచిలి మున్సిపాలిటీకి మేనేజర్‌గా వెళ్ళారు. నూతన కమిషనర్‌కి నగర పంచాయతీ మేనేజర్ విశ్వేశ్వరరావు, సిబ్బంది పాపయ్య రాజు, డి.ఉమా భాస్కర్, మెప్మా సిఎంఎం డి. గోవింద రావు శుభాకాంక్షలు తెలిపారు.

**బొబ్బిలి ఆర్‌డిఒ సాయిశ్రీ బదిలీ**

బొబ్బిలి : బొబ్బిలి ఆర్‌డిఒ ఎ.సాయిశ్రీ జమ్మలమడుగు ఆర్‌డిఒగా బదిలీ అయ్యారు. ఏడాదిన్నర నుంచి ఆర్‌డిఒగా బొబ్బిలిలో ఆమె పని చేస్తున్నారు. బొబ్బిలిలో పని చేయడం ఎంతో ఆనందంగా ఉందని సాయిశ్రీ అన్నారు. బొబ్బిలి ఆర్‌డిఒగా శ్రీకాకుళం జిల్లా నుంచి జెవిఎస్ రామ్మోహనరావు బదిలీపై రానున్నారు.

## ఇంజినీరింగ్ కార్మికులకు బేసిక్ వేతనం ఇవ్వాలి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

నగరపాలక సంస్థలు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో ప్రజానీకానికి తాగునీరు అందిస్తున్న పంపింగ్, సరఫరా, లీకులు, వాల్వాపరేటర్లు విభాగంలో పనిచేస్తున్న ఇంజినీరింగ్ విలీన ప్రాంత కార్మికులకు బేసిక్ వేతనం రూ.21000, టెక్నికల్ వేతనం 24500 చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 30న కలెక్టరేట్ వద్ద ధర్నా చేయనున్నట్లు ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ. జగన్మోహన్‌రావు తెలిపారు. శుక్రవారం ఎల్‌బిజి భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 10, 11 పి ఆర్ సిలో ఇంజినీరింగ్ కార్మికులకు తీవ్ర అన్యాయం జరిగిందని తెలిపారు. 2012 నాటి కనీస వేతనాలు నేటికీ అమలులో ఉన్నాయని, ప్రస్తుత ధరలకు అనుగుణంగా చట్ట సవరణ చేయాలన్నారు.

విజయనగరం కార్పొరేషన్ పంప్ హౌస్ కార్మికులు థర్డ్ పార్టీ విధానంలో నలిగిపోతున్నారని, నెలల తరబడి జీతాలు చెల్లించడం లేదని, అయినా అదే కాంట్రాక్టర్ కి మళ్ళీ టెండర్లు ఖరారు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే టెండర్ ప్రకారం జీతాలు చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని , బకాయి జీతాలు చెల్లించాలని, కాంట్రాక్టర్ వచ్చినప్పటి నుంచి టెండర్ ప్రకారం చెల్లించాల్సిన బకాయిలను ఏరియాస్ రూపంలో ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యూనియన్ నాయకులు రామానాయుడు, అరుణ, నారాయణరావు ,సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## సమన్వయంతో అభివృద్ధికి కృషి

**మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ రవీంద్ర**

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అన్ని విభాగాల సమన్వయంతో నగర అభివృద్ధే ధ్యేయంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజినల్ డైరెక్టర్ వి.రవీంద్ర అన్నారు. శుక్రవారం విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పి. నల్లనయ్య ఛాంబర్‌లో రీజనల్ డైరెక్టర్ వి.రవీంద్ర వివిధ విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. విభాగాల వారీగా చేపట్టాల్సిన ప్రాధాన్యత అంశాలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి రెవెన్యూ వసూళ్లను గణనీయంగా పెంచాలని సూచించారు. లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని రెవెన్యూ సిబ్బందికి ఆదేశించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, కావున ముందస్తు జాగ్రత్తగా అన్ని చర్యలు తీసుకోవాలని ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తిని ఆదేశించారు. వీధుల్లో పరిశుభ్ర వాతావరణం నెలకొనే విధంగా ఎప్పటికప్పుడు జాగ్రత్త వహించాలన్నారు. అనంతరం ఇంజనీరింగ్, ప్రణాళిక విభాగం అధికారులతో చర్చించారు. సమావేశంలో విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పి. నల్లనయ్య, సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ రవీంద్ర

## నాటికలు, ఏకపాత్రాభినయ ప్రదర్శనకు దరఖాస్తులు ఆహ్వానం

**జిల్లా ఆడిట్ అధికారి అరుణకుమారి**

ప్రజాశక్తి-విజయనగరం

విజయనగరం ఉత్సవాల్లో భాగంగా అక్టోబరు 13,14 తేదీల్లో గురజాడ కళాభారతిలో ఉదయం 10 గంటలు నుంచి సాయంత్రం 6 గంటలు వరకు నాటికలు, ఏకపాత్రాభినయాల ప్రదర్శన జరుగుతుందని కమిటీ సభ్యులు, జిల్లా ఆడిట్ అధికారి బి.అరుణకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రదర్శనలో పాల్గొనాలనే ఆసక్తి ఉన్న స్థానిక కళాకారులు తమ పేర్లను ఈ నెల 2వ తేదీలోగా నమోదు చేసుకోవాలని కోరారు. కళాకారులు స్థానికులై ఉండాలని, నాటిక ప్రదర్శన గంటకు మించి, ఏకపాత్రాభినయ ప్రదర్శన (పౌరాణిక పాత్రలు) 15 నిమిషాలు మించి ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రదర్శనలకు దరఖాస్తు చేసుకున్న కళాకారులకు, స్క్రూటినీ అనంతరం వారి వ్యక్తిగత ఫోన్ నెంబరు కు సమాచారం ఇస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు అక్టోబరు 2వ తేదీ సాయంత్రం 5 గంటలు లోగా తమ దరఖాస్తులను కలెక్టరేట్‌లోని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, తోటపల్లి బ్యారేజ్ యూనిట్-3 (7396832929), ఫారెస్ట్ సెటిల్‌మెంట్ ఆఫీసర్ (9515129843) కార్యాలయాల్లో అందజేయాలని సూచించారు.

## జానపద కళల ప్రదర్శనకు దరఖాస్తులు

ప్రజాశక్తి-విజయనగరం కోట

విజయనగరం ఉత్సవాల్లో భాగంగా అక్టోబరు 13,14 తేదీల్లో లయన్స్ కమ్యూనిటీ హాల్‌లోఉదయం 9గంటలు నుంచి రాత్రి 11గంటలు వరకు జానపద కళల ప్రదర్శన జరుగుతుందని కమిటీ సభ్యులు, ఉప సంచాలకులు, సాంఘిక సంక్షేమ శాఖ బోని రామానందం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రదర్శనలో పాల్గొనాలనే ఆసక్తి ఉన్నస్థానిక కళాకారులు తమ పేర్లను ఈనెల 2వ తేదీలోగా నమోదు చేసుకోవాలని కోరారు. కళాకారులు స్థానికులై ఉండాలని, జానపద కళా ప్రదర్శన అరగంట, మించి, నృత్య, వాయిద్య ప్రదర్శన 15 నిమిషాలు మించి ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రదర్శనలకు దరఖాస్తు చేసుకున్న కళాకారులకు, స్క్రూటినీ అనంతరం వారి వ్యక్తిగత ఫోన్ నెంబరు కు సమాచారం ఇస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు అక్టోబరు 2వ తేదీ సాయంత్రం 5 గంటలు లోగా తమ దరఖాస్తులను ఉప సంచాలకులు సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయం :89192 22064, 9347522850, 7660922850, 8179522850 అందజేయాలని సూచించారు.

## స్పెషల్ బ్రాంచ్ సిఐ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీసు - 1 గా ఎ.వి.లీలారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం, జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్‌ను మర్యాద పూర్వకంగా కలిసి, పూల మొక్కలను అందజేశారు.

## మత విద్వేషాలు రెచ్చగొడుతున్నారు

**జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు**

ప్రజాశక్తి-బాడంగి

రాష్ట్రంలో కావాలనే మత విద్వేషాలు రెచ్చగొట్టి, ఉద్రిక్తతలు సృష్టించాలని కూటమి ప్రభుత్వం చూస్తోందని జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆరోపించారు. శుక్రవారం స్థానిక ఎంపిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉద్దేశ పూర్వకంగా ప్రభుత్వం మత కల్లోలాలను లేపడానికి ప్రయత్నిస్తోందన్నారు. చిచ్చు రాజేసి, ఆ మంటల్లో చలికాచుకోవడానికి ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. కూటమి పాలకులు ఇష్టానుసారం మాట్లాడినా.. మీపై ఎలాంటి ఆంక్షలు లేవని, మాజీ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి తిరుమల వెళ్తే ఆంక్షలు పెట్టడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న పార్టీలు, వారి సంఘాలు ఉద్రిక్తతలను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తుంటే.. తమను ఆపడం ఏమిటని నిలదీశారు. రోజుకో రకంగా మాట్లాడిన కూటమి నేతలు భక్తులను మనోవేదనకు గురిచేశారన్నారు. చంద్రబాబు, పవన్, లోకేష్.. ఒక్కొక్కరూ ఒక్కోరకంగా మాట్లాడుతున్నారని, ఇదంతా దేనికోసమని ప్రశ్నించారు. లడ్డు వ్యవహారంలో ఒక్క ఆధారాన్ని కూడా ఇప్పటికీ చూపలేకపోయారని చెప్పారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు, ఎంపిపి బోగి గౌరి, జెడ్‌పిటిసి పెద్దింటి రామారావు పాల్గొన్నారు.

## కెజిబివిల్లో ఉద్యోగాల కోసం దళారులను నమ్మి మోసపోవద్దు

**సమగ్ర శిక్షా ఎస్‌పిడి శ్రీనివాసరావు**

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

పాఠశాల విద్యాశాఖ-సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయాల్లో 507 మంది బోధన సిబ్బందిని ఒప్పంద ప్రాతిపదికన , 97 మంది బోధనేతర సిబ్బందిని పొరుగు సేవల (ఔట్ సోర్సింగ్) ప్రాతిపదికన ఒక సంవత్సర కాలానికి గానూ నియామకం కోసం భర్తీ చేస్తున్నట్లు సమగ్ర శిక్ష ఎస్‌పిడి బి.శ్రీనివాసరావు తెలిపాఉ. ఈ నేపథ్యంలో నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇప్పిస్తామని ఎర చూపి దళారులు పైరవీలు చేస్తునట్లు వార్తలు వస్తున్నాయి. లక్ష నుండి 5 లక్షలు చెల్లిస్తే (అడ్వాన్స్ గా రూ.20వేలు నుండి రూ. 80వేలు) పోస్ట్ గ్యారెంటీ అని చెబుతున్నట్లుగా తమ కార్యాలయం దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు నియామకాలు పూర్తిగా పారదర్శకంగా నిర్వహిస్తామన్నారు. జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో మెరిట్ ఆధారంగా చేపడతామని తెలిపారు. ఏ పోస్టుకు కూడా మౌఖిక పరీక్షలు కాని, స్కిల్ పరీక్షలుగాని ఉండవని, కావున ఎవరైనా దళారులు ఇంటర్వ్యూలో మార్కులు వేయిస్తామని గాని, ఉద్యోగాలు ఇప్పిస్తామని గాని ప్రలోభ పెట్టిన యెడల మీ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోగానీ, రాష్ట్ర సంచాలకుల కార్యాలయం లో గాని ఫిర్యాదు చేయాలని తెలిపారు. ప్రలోభాలకు గురిచేస్తున్న దళారులపై కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉద్యోగ నియామకాల గురించి ఎవరైనా దళారులకు డబ్బులు ఇచ్చి మోసపోవద్దని తెలిపారు.

## క్లాప్ వెహికల్ డ్రైవర్ల బిక్షాటన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

క్లాప్ వెహికల్ డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోసం ఎపి స్వచ్ఛాంధ్ర క్లాప్ వెహికల్ డ్రైవర్స్ యూనియన్ ( ఎఐటియుసి) ఆధ్వర్యంలో శుక్రవారం విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం దగ్గర గత మూడు రోజులుగా చేస్తున్న నిరసన కార్యక్రమాలో భాగంగా శుక్రవారం బిక్షాటన చేశారు. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ మాట్లాడుతూ క్లాప్ డ్రైవర్లతో గొడ్డు చాకిరీ చేయించుకుంటూ జీతాలు పెంచాలని, పిఎఫ్ డబ్బులు జమ చేయాలని, ఇఎస్ఐ కార్డులు ఇప్పించాలని అడిగితే సంబంధం లేదని అనడం కమిషనర్‌కు సరికాదని అన్నారు. జీవో ప్రకారం ఇస్తున్న రూ.18,500లో కాంట్రాక్టర్లు కొంత మింగేస్తూ 10,000 మాత్రమే చేస్తున్నారని ఆరోపించారు. జరుగుతున్న అవకతవకలను తక్షణమే అధికారులు సరి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు ఎస్. రంగరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు పొడుగు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి బంగారు శ్రీనివాసరావు, క్లాప్ వెహికల్ డ్రైవర్లు పాల్గున్నారు.

## పర్యాటక కేంద్రంగా అభివృద్ధి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం సంస్కృతి సంప్రదాయాలకు నెలవని, చాలా ప్రముఖ చారిత్రక ప్రదేశాలు, పర్యాటక ప్రాంతాలు, పుణ్య క్షేత్రాలు ఇక్కడ ఉన్నాయని, వాటిని అభివృద్ధి చేయడం ద్వారా ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయవచ్చని ఎమ్మెల్యే పి.అదితి విజయలక్ష్మి గజపతి రాజు అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం కేంద్రీయ గిరిజన విశ్వ విద్యాలయం, మాన్సస్ విద్యా సంస్థలు, టూరిజం శాఖ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా తొలుత పైడితల్లి అమ్మవారి గుడి నుండి కోటలో గల రౌండ్ మహల్ వరకు వివిధ దేశాల వస్త్రధారణలతో విద్యార్థులు 'కల్చరల్ వాక్' నిర్వహించారు. అనంతరం రౌండ్ మహల్‌లో విద్యార్థులు కోలాటం, గిరిజన సాంస్కృతిక థింసా నృత్యాలు ఆకట్టుకున్నాయి. సభకు అధ్యక్షత వహించిన సిటియు వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ తేజస్వి కట్టిమని మాట్లాడుతూ విజయనగరం పర్యాటక శాంతి, సామాజిక, ఆర్థిక అభివృద్ధిలో కీలక పాత్ర వహించేదిగా ఉండాలని అన్నారు. మాన్సాస్ విద్యాసంస్థల కరస్పాండెంట్ ప్రొఫెసర్ కె.వి. లక్ష్మిపతి రాజు మాట్లాడుతూ పర్యాటకరంగం ద్వారా మన వారసత్వాన్ని కాపాడుతూ సాంస్కతిక ఐక్యతను కలిగించేలా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ డీన్ జితేంద్ర మోహన్ మిశ్రా, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ తంత్రవాహి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అదితిని సత్కరిస్తున్న సిటియు విసి కట్టిమణి

## 23 మందిపై డ్రంకన్ డ్రైవ్ కేసులు

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలో మద్యం సేవించి వాహనాలు నడిపిన వాహనదారులపై కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్ హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు నిర్వహిస్తున్న విజిబుల్ పోలీసింగులోభాగంగా శుక్రవారం ప్రత్యేకంగా డ్రైవ్ చేపట్టారు. విజయనగరం ట్రాఫిక్ సిఐ సూరినాయుడు ఆధ్వర్యంలో ట్రాఫిక్ ఎస్ఐలు శంబంగి రవి, లోవరాజు, ఎ.మహేశ్వరరాజు, చిన్నారావులు ప్రత్యేక డ్రైవ్ లు చేపట్టి, మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 23 మందిపై డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదు చేసి, వారిని న్యాయస్థానం ముందు హాజరుపర్చగా, వారందరికీ రూ.లక్షా 20వేలు జరిమానా విధించారు. పోలీసుశాఖలో వివిధ హోదాల్లో పని చేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి ఎస్‌పి వకుల్ జిందాల్ శుక్రవారం వెల్ఫేర్ డే నిర్వహించారు.

## స్వచ్ఛత కార్యక్రమాలు భవిష్యత్తుకు స్ఫూర్తిదాయకం

విజయనగరం టౌన్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న స్వచ్ఛతా మి సేవ కార్యక్రమాలు భవిష్యత్తులో స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని నగరపాలక సంస్థ కమిషనర్ పి. నల్లనయ్య అన్నారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన స్వచ్ఛతా హీ సేవ సెల్ఫీ పాయింట్లు ఆయన ప్రారంభించారు. కమిషనర్ పి. నల్లనయ్య, ఇతర అధికారులు సెల్ఫీ పాయింట్లు వద్ద తమ స్వీయ చిత్రాలను తీసుకున్నారు. అక్టోబర్ 2 గాంధీ జయంతి వరకు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు అన్ని ప్రాంతాలలో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

## పలుచోట్ల ఎస్ఎఫ్ఐ ఫ్లాష్‌మాబ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

డ్రగ్స్‌ను నిర్మూలిద్దాం.. భవిష్యత్తును కాపాడుకుందాం అంటూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు శుక్రవారం పలుచోట్ల ఫ్లాష్ మాబ్ నిర్వహించారు. ఈనెల 28, 29, 30 తేదీలలో జరగబోయే భగత్ సింగ్ స్టూడెంట్ ఫెస్ట్‌ను జయప్రదం చేయాలని కోరుతూ ఈ కార్యక్రమం చేపట్టారు. కలెక్టరేట్, కన్యకా పరమేశ్వరీ కోవెల, గంట స్థంభం, అంబటి సత్రం, ఎంఆర్ కాలేజీ వద్ద ఫ్లాష్ మాబ్స్ నిర్వహించారు. పలు కళాశాలల నుంచి వచ్చిన విద్యార్థి బృందాలు పలు సినిమా పాటలకు నృత్యాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు జె .రవికుమార్ మాట్లడుతూ జిల్లాలో రోజురోజుకూ పెరిగిపోతున్న డ్రగ్స్ మత్తు పదార్థాలను నిర్మూలించాలని కోరుతూ ఎస్ఎఫ్ఎ ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తుందని దానిలో భాగంగా ఈనెల 28 29 30 తేదీలలో విజయనగరంలో గల గురజాడ కళాక్షేత్రంలో పెద్ద ఎత్తున భగత్ సింగ్ స్టూడెంట్ ఫెస్ట్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు , ఎస్ సమీరా, ఎం రమేష్ , రాజు , సుస్మిత , రమణ , చరణ్ పాల్గొన్నారు.

## ఉత్సాహంగా తైక్వాండో పోటీలు

**రాష్ట్ర పోటీలకు బాలురు ఆరుగురు, బాలికలు 8 మంది ఎంపిక**

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అండర్ 19 స్కూల్.గేమ్స్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక రాజీవ్ గాంధీ స్టేడియం లో జరిగిన తైక్వాండో పోటీలు ఉత్సాహంగా సాగాయి. జిల్లా వ్యాప్తంగా వచ్చిన విద్యార్థులకు ఎంపిక పోటీలు నిర్వహించగా వారిలో బాలురు 6, బాలికలు 8 మందిని రాష్ట్ర పోటీలకు ఎంపిక చేశామని అండర్ 19 స్కూల్ గేమ్స్ కార్యదర్శి కృష్ణ తెలిపారు. కడపలో అక్టోబర్ 4,5 తేదీల్లో జరగనున్న రాష్ట్ర పోటీల్లో జిల్లా నుంచి ఎంపికైన క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. క్రీడాకారుల్లో ప్రతిభ ఆధారంగా ఎంపిక చేస్తామన్నారు.

## టేబుల్ టెన్నిస్ జిల్లా జట్ల ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్థానిక పిఎస్ఆర్ స్కూలులో అండర్ 14, 17 టేబుల్ టెన్నిస్ ఎంపికలు జరిగాయి. ఈ రెండు విభాగాల్లో బాల, బాలికల జట్లు ఎంపిక జరిగినట్లు స్కూల్ గేమ్స్ కార్యదర్శి కృష్ణంరాజు తెలిపారు. కార్యక్రమంలో పువ్వాడ స్కూల్ కరస్పాండెంట్ పాకలపాటి సన్యాసి రాజు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఎంపికైన వారు త్వరలో నంద్యాలలో జరగబోయే పోటీలలో పాల్గొనున్నారు.

## ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి : ఎస్‌పి

ప్రజాశక్తి-విజయనగరంకోట

వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎస్‌పి వకుల్ జిందాల్

పోలీసులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఎస్‌పి వకుల్ జిందాల్ అన్నారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా తిరుమల - మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యాన పోలీసులకు శుక్రవారం ఆరోగ్య పరీక్షలు చేశారు. ఆస్పత్రి ఎమ్‌డి డాక్టర్ తిరుమల ప్రసాద్ ఆధ్వర్యాన 120మందికి ఇసిజి, బిపి, రక్త పరీక్షలు, స్క్రీనింగు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు అంతర్గత భద్రతకు పోలీసుశాఖ శక్తి వంచన లేకుండా పని చేస్తూ, తమ ఆరోగ్యాలపై ప్రత్యేక శ్రద్ధ వహించక పోవడం వలన అనారోగ్యం పాలవుతున్నారని అన్నారు. ఉద్యోగంలో చేరినపుడు అత్యంత ఫిట్ గా ఉండే పోలీసులు, ఉద్యోగ విరమణ సమయానికి అనేక రకాలైన ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. విధి నిర్వహణలో ఒత్తిడి, సమయానికి భోజనం చేయలేకపోవడం, ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించక పోవడం, ఎక్కువ గంటలు పని చేయడం, తినే ఆహారం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపకపోవడం వంటి కారణాలతో అనారోగ్యం పాలవుతున్నారని అన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ తిరుమల ప్రసాద్‌ను సత్కరించారు.



సిఎం చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

## సిఎం సహాయనిధికి రూ.73 లక్షలు విరాళం

ప్రజాశక్తి-బొబ్బిలి

విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు ప్రజలు, టిడిపి నాయకులు, ఉద్యోగుల నుంచి సేకరించిన రూ.73 లక్షల చెక్కును సిఎం సహాయ నిధికి ఎమ్మెల్యే బేబినాయన అందజేశారు. శుక్రవారం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు మాజీమంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడుతో కలిసి ఆయన చెక్కును అందజేశారు. వరద బాధితులను ఆదుకునేందుకు బొబ్బిలి నియోజకవర్గ ప్రజలు విరాళాలు ఇచ్చినట్లు చంద్రబాబుకు చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బేబినాయనను సిఎం అభినందించారు.

### 'లెండి' రూ.5 లక్షలు విరాళం

**డెంకాడ :** విజయవాడ వరద బాధితుల కోసం లెండి కళాశాల యాజమాన్య సభ్యులు పి.మధుసూదనరావు, పి.శ్రీనివాసరావు, కె.శివరామకృష్ణ.. రూ. 5 లక్షలు డిడిని ముఖ్యమంత్రి సహాయనిధికి అందించారు. ఈ డిడిని మంత్రి నారా లోకేష్‌కు అందజేశారు. సకాలంలో సహకరించిన లెండి ఇన్‌స్టిట్యూట్ యాజమాన్యానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

### వరద బాధితులకు విద్యార్థుల సహాయం

**కొత్తవలస :** విజయవాడ వరద బాధితుల కోసం కంటకాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తమ వంతు విరాళాన్ని అందించారు. వీరు సమకూర్చిన రూ.16,365 చెక్కును కలెక్టర్ బిఆర్ అంబేద్కర్‌కు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో డిఇఒ ఎన్.ప్రేమ్‌కుమార్, పాఠశాల హెచ్‌ఎం వి.అరుణకుమార్, తదితరులు పాల్గొన్నారు.

**విజయనగరం :** చీపురుపల్లికి చెందిన లిటిల్ ఏంజెల్ ప్రైమరీ ఇంగ్లీషు మీడియం స్కూలు విద్యార్థులు సేకరించిన రూ.60,000 మొత్తాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి ప్రేమకుమార్ ఆధ్వర్యంలో విద్యార్థినులు బి.కల్పన, ఎం.పుష్పలత కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌కు కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం అందజేశారు.

## 1న భవన నిర్మాణ కార్మికుల ధర్నా

**వంగర :** అక్టోబర్ ఒకటో తేదిన రాజాం ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి ప్రదర్శన, కార్మిక శాఖ కార్యాలయం వద్ద ధర్నా చేపడుతున్నట్లు భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అరటికట్ల ఆదినారాయణ, బొడ్రోతు గౌరునాయుడు తెలిపారు. ఈ మేరకు అరసాడలో కార్మికులతో కలిసి ధర్నా వాల్‌పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల పెండింగ్‌లో ఉన్న క్లెయిములను వెంటనే పరిష్కరించాలని, సంక్షేమ బోర్డును సమర్థవంతంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

## ఎల్డ్రాక్ ఇండియా కె అవార్డుకు 'ఫోర్ట్‌సిటీ' ఎంపిక

**విజయనగరం టౌన్ :** నగరంలోని ఫోర్టుసిటీ పాఠశాలకు ఇన్నోవా టీచింగ్ మెథడ్స్ అంశంలో ఎల్డ్రాక్ ఇండియా కె -12 అవార్డు లభించింది. ఈ అవార్డును ఫోర్ట్ సిటీ పాఠశాల ప్రిన్సిపల్ డాక్టర్ రీయినాఖాన్ బెంగుళూరులో అందుకున్నారు. ఈ అవార్డులకు 15 రాష్ట్రాలకు సంబంధించిన పాఠశాలలను 10 నుండి 12 అంశాలలో ఎంపిక చేశారు. పాఠశాల చైర్మన్ కె.ఎ.పి.రాజు (శివ) మాట్లాడుతూ రాష్ట్రంలో ఫోర్టు సిటీ పాఠశాలకు 'ఇన్నోవేటివ్ టీచింగ్ మెథడ్స్ అంశంలో రావడం రావడం చాలా గర్వకారణంగా వుందన్నారు. తమ పాఠశాల ఉపాధ్యాయులు వివిధ రకాలైన కొత్త మెథడ్స్ ఉపయోగిస్తూ విద్యార్థులను నిరంతరం మెరుగుపరచడానికి ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. పాఠశాల చైర్మన్‌తోపాటు, వైస్ చైర్మన్ చంటి, ప్రిన్సిపాల్ డాక్టర్ రీయినాఖాన్, డైరెక్టర్లు మధు, నీలిమా, ఉపాధ్యాయులు, విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు.

## 'గౌరీ విద్యానికేతన్'లో స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్

**శృంగవరపుకోట :** మండలంలో భవానినగర్‌లో ఉన్న గౌరీ విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్‌ను శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, ఎంఇఒ బి.నర్సింగరావు ప్రారంభించారు. నర్సరీ నుండి 5వ తరగతి విద్యార్థిని, విద్యార్థులు ఇప్పటివరకు పూర్తయిన పాఠ్యాంశాలపై ప్రాజెక్టులు తయారు చేసి అందులో ప్రదర్శించారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ సన్యాసినాయుడు, ప్రధానోపాధ్యాయులు కాండ్రేగుల వెంకటరాము పాల్గొన్నారు.

## అమృత హస్తానికి గద్దె చేయూత

**చీపురుపల్లి :** మానవీయత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న శాశ్వత అమృత హస్తం కార్యక్రమానికి రాష్ట్ర సివిల్ సప్లై డైరెక్టర్ గద్దె బాబూరావు చేయూతనిచ్చారు. కార్యక్రమం ద్వారా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు ఆహారాన్ని అందిస్తున్నారు. అందులో భాగంగా గద్దె బాబూరావు రూ.10 వేలు విరాళంగా అందించారు. అనంతరం స్థానిక ఆసుపత్రిలో ఉన్న రోగులకు ఆహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయిని గొర్లె పద్మావతి, నారాయణ రావు, వావిలపల్లి మోహన్‌రావు, కృష్ణమూర్తి, టిడిపి పట్టణ అధ్యక్షులు గవిడి నాగరాజు పాల్గొన్నారు.

## మద్యాన్ని నియంత్రించాలి

**బొబ్బిలి :** మద్యాన్ని నియంత్రించాలని రైతు సంక్షేమ సంఘం అధ్యక్షులు వేమిరెడ్డి లక్ష్మునాయుడు డిమాండ్ చేశారు. తన కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మద్యాన్ని విచ్చలవిడిగా అమ్మకాలు జరిపేందుకు ప్రయివేట్ వ్యాపారులకు మద్యం షాపులను అప్పగిస్తున్నారని ఆరోపించారు. ప్రయివేట్ షాపులకు మద్యం దుకాణాలను అప్పగించడం వల్ల గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు తెరుస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. పాత పద్ధతిలో మద్యం అమ్మకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

## ఇ-క్రాప్ నమోదుకు 2 రోజులే గడువు

**శృంగవరపుకోట :** ఇ- క్రాప్ నమోదుకు రెండు రోజులే గడువుందని ఎఒ రవీంద్ర తెలిపారు. ఇ-క్రాప్, ఇ-కెవైసి పూర్తయితేనే ధాన్యం కొనుగోళ్లు, క్రాప్ ఇన్సూరెన్స్, వ్యవసాయ పథకాలు లభిస్తాయని చెప్పారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఎమ్మెల్యే మాధవిని కలిసిన జనసైనికులు


ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

**బొబ్బిలి :** నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవిని బొబ్బిలి, పార్వతీపురం, కురుపాం నియోజకవర్గాల జనసేన నాయకులు శుక్రవారం కలిశారు. ఉమ్మడి జిల్లాలో జనసేన బలోపేతానికి పని చేస్తామని బాబు పాలూరి, వై.తిరుపతినాయుడు, విశ్వేశ్వరరావు, చంద్రశేఖర్ అన్నారు.

## జగ్గయ్యపేటలో గ్రామసభ

**వేపాడ :** మండలంలో జగ్గయ్యపేటలో శుక్రవారం గ్రామసభ ఏర్పాటుచేశారు. స్వర్ణాంధ్ర-2047లో భాగంగా గ్రామాభివృద్ధిపై ఎంఇఒ పి.బాలభాస్కరరావు గ్రామస్తులతో చర్చించారు. కార్యక్రమములో గ్రామ పెద్దలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**అరిగిపాలెం పాఠశాల సందర్శన**

మండలంలోని అరిగిపాలెం పాఠశాలను ఎంఇఒ పి.బాలభాస్కరరావును సందర్శించారు. స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో పిచ్చిమొక్కలు తొలగింపజేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. అనంతరం గ్రామంలో గ్రామసభ ఏర్పాటుచేశారు.

## పోషకాహార ప్రదర్శన

**వేపాడ :** పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయం వద్ద అంగన్వాడీ కార్యకర్తలు పోషకాహార ప్రదర్శన ఏర్పాటుచేశారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలున్న పదార్థాలతో స్టాల్స్‌ని ఏర్పాటు చేశారు. గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. తహశీల్దార్ సన్యాసినాయుడు, వైద్యులు ధరణి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు జి.కామేశ్వరి, పి.భాగ్యవతి మాట్లాడుతూ తల్లులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు.

గర్భిణులకు సీమంతాలు చేస్తున్న అధికారులు

# ఎట్టకేలకు..!

- ప్రజలకు ఇబ్బందులు లేకుండా విమానాశ్రయ వర్షపు నీరు బయటకు
- గెడ్డల్లోని పూడికతీతకు నిర్ణయం
- కలెక్టర్ ఆదేశాలతో కదిలిన నీటిపారుదల శాఖ
- ఎయిర్‌పోర్టు నిర్మాణ సంస్థతో పనులు ప్రారంభం

గూడెపువలస వద్ద పొక్లెయినర్‌తో చేపట్టిన పూడికతీత పనులు

ప్రజాశక్తి-భోగాపురం

విమానాశ్రయం నిర్మిస్తున్న ప్రాంతంలోని వర్షపు నీటిని ప్రజలకు ఇబ్బంది లేకుండా బయటకు మళ్లించే పనులను నీటిపారుదల శాఖ అధికారులు ప్రారంభించారు. విమానాశ్రయం చుట్టూ తొమ్మిది వైపుల నుంచి నీరు బయటకు వెళ్లేలా గెడ్డల్లో ఉన్న పూడికలను తీసేలా ఇటీవల ప్రణాళికలు సిద్ధం చేశారు. ప్రస్తుతం ఇందులో ఉన్న చెరువులు, వాగులు, వంకలు విమానాశ్రయం నిర్మాణానికి అడ్డంగా ఉండటంతో కప్పేశారు. దీనివల్ల సంబంధిత వర్షపునీరు కంచేరు, గూడెపువలస వంటి గ్రామాలపైకి వచ్చేస్తోంది. అంతేకాక లోపల నుంచి వచ్చే వరద ఉధృతికి జమ్మయ్యపేట వెళ్లే రహదారిలో ఏకంగా రాకపోకలు నిలిచిపోతున్నాయి. దీంతో సుమారు నాలుగైదు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని జిల్లా కలెక్టరు ఆదేశాలతో నీటిపారుదల శాఖ అధికారులు దీనిపై ప్రత్యేక దృష్టి సారించారు.

భోగాపురం విమానాశ్రయాన్ని 2200 ఎకరాల్లో నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో సుమారు మూడు పెద్ద చెరువులు ఉండేవి. అంతేకాక పెద్ద గెడ్డలు, వాగులు కూడా ఉండేవి. వర్షం పడితే నీరు చెరువుల్లోకి వెళ్లేది. ఇంకా ఎక్కువ వర్షం పడితే అక్కడ నుంచి నేరుగా గెడ్డల్లో నుంచి విమానాశ్రయానికి వెలుపల ఉన్న చెరువుల్లోకి లేదా సమీపంలో ఉన్న సముద్రంలోకి నీరు తరలిపోయేది. కాని విమానాశ్రయ నిర్మాణంలో భాగంగా సంబంధిత భూముల్లో ఉన్న చెరువులు, గెడ్డలు, వాగులు పూర్తిగా కప్పేశారు. దీంతో వర్షపు నీరు ఇప్పుడు సమీపంలోని గ్రామాలపైకి, చెరువుల్లో నుంచి పంటపొలాల్లోకి వస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై 'ప్రజాశక్తి'లో కూడా కథనాలు కూడా వచ్చాయి. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టరు బిఆర్ అంబేద్కర్ స్పందించారు. ప్రజలకు ఇబ్బందులు కలగ కుండా ఉండేందుకు చర్యలు చేపట్టాలని నీటిపారుదలశాఖ అధికారులను ఆదేశించారు.

**పనులు ప్రారంభం**

నీటిపారుదలశాఖ అధికారులు సంబంధిత పనుల కోసం సుమారు రూ.40 లక్షలతో అంచనాలు వేసి నివేదికను పంపించారు. ఈ సొమ్మును నిర్మాణ సంస్థ చెల్లిస్తే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. దీంతో నిర్మాణ సంస్థ ఎల్‌అండ్‌టి సంస్థ అంత సొమ్ము చెల్లించలేమని, మిషనరీ తమ వద్ద ఉన్నందున ఆ పనులు తామే చేసి పెడతామని తెలిపింది. అందుకు అధికారులు అనుమతించారు. దీంతో నీరు మళ్లింపు పనులను రెండు రోజుల కిందట ప్రారంభించారు. గెడ్డలను వెడల్పు చేసి వర్షపు నీరు వెళ్లేందుకు, పూడిక పొక్లెయినర్లతో తీసే పనులు ప్రారంభమయ్యాయి. రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు ఈ పనులు ప్రస్తుతం నిలిచిపోయాయి. గూడెపువలస సమీపంలోని మూడు గుడుల వద్ద ఈ పనులు ప్రారంభించారు. ఇంతలో వర్షాలు పడుతుండడంతో నిలిపివేసినట్లు సమాచారం.

### తొమ్మిది వైపుల నుంచి నీరు బయటకు

విమానాశ్రయం లోపల నుంచి వస్తున్న వర్షపు నీటితో ప్రజలకు ఇబ్బంది లేకుండా బయటకు వెళ్లేందుకు కలెక్టరు ఆదేశాల మేరకు ప్రతిపాదనలను సిద్ధం చేశాం. విమానాశ్రయం చుట్టూ ఉన్న వివిధ గ్రామాల వైపు నుంచి అనగా తొమ్మిది వైపులా నీరు మళ్లించేలా నిర్ణయించాం. ఇందుకు సంబంధించిన పనులను కూడా రెండు రోజులు కిందట ప్రారంభమయ్యాయి. ఇంతలో వర్షాలు పడుతుండడంలో పనులకు ఆటంకం నెలకొంది.

– బి.సంతోష్ కుమార్, నీటిపారుదల శాఖ డిఇ

సమావేశంలో మాట్లాడుతున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

మహిళా ప్రజాప్రతినిధులకు బదులుగా హాజరైన డమ్మీలు

## డమ్మీలతో సమావేశం

ప్రజాశక్తి-బాడంగి

మహిళలకే తొలి ప్రాధాన్యం... మహిళలకే పెద్దపీట... మహిళలకే అగ్రతాంబూలం... ఎక్కడ సమావేశం, సభ జరిగినా పాలకుల ఊకదంపుడు ఉపన్యాసాలివి. ఆచరణకొచ్చేసరికి వారికి కనీస ప్రాధాన్యత ఇవ్వడం లేదు. సర్పంచులు, ఎంపిటిసిలుగా ప్రజలు ఎన్నుకున్నా సరే.. వారిని వంటింటికి పరిమితం చేస్తున్నారు. శుక్రవారం నిర్వహించిన బాడంగి మండల సర్వసభ్య సమావేశమే అందుకు నిదర్శనం. ఇంతకీ ఏం జరిగిందంటే..?

మండలంలోని సర్పంచులు, ఎంపిటిసిలతో స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సమావేశానికి మహిళా సర్పంచులు, ఎంపిటిసి సభ్యులకు బదులుగా వారి భర్తలు, ప్రతినిధులు హాజరు కావడం గమనార్హం. జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు హాజరైన ఈ సమావేశానికి సభ్యుల్లో అనేకమంది డమ్మీలు రావడంతో అధికారులు ముక్కున వేలేసుకొని ఉండిపోయారు. ఈ సందర్భంగా జెడ్‌పి చైర్మన్ మాట్లాడుతూ పార్టీలకతీతంగా అందరూ కలిసి గ్రామాలాభివృద్ధికి సహకరించాలని కోరారు. ఎరుకులపాకలు గ్రామం నుంచి గజరాయనివలస పాఠశాలలో విలీనం చేసిన తరగతులను పునరుద్ధరించాలని ఎంపిటిసి పాలవలస గౌరు సమావేశంలో కోరారు. కార్యక్రమంలో ఎంపిపి బోగి గౌరి, జెడ్‌పిటిసి రామారావు, వైస్ ఎంపిపిలు ఎస్.భాస్కర్ రావు, రమేష్, ఎంపిడిఒ మహేశ్వరరావు, తహశీల్దార్ సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

### గ్రీన్ అంబాసిడర్ల సమస్యలపై వినతి

గ్రీన్‌అంబాసిడర్లకు వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే జీతాలు ఇప్పించాలని సిఐటియు నాయకులు సురేష్.. జెడ్‌పి చైర్మన్‌కు వినతి అందించారు. 6 నెలల నుంచి 18 నెలల వరకు గ్రామాన్ని శుభ్రం చేస్తున్నా జీతాలు ఇవ్వకపోవడంతో వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్ల సంఘం నాయకులు సింహాచలం, జగదీష్ పాల్గొన్నారు.

## ఇవిఎం గోడౌన్ తనిఖీ

ప్రజాశక్తి-నెల్లిమర్ల

స్థానిక ఇవిఎం గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ శుక్రవారం తనిఖీ చేశారు. గోదాముకు, గదులకు వేసిన సీళ్లను తెరిపించి పరిశీలించారు. అనంతరం సీళ్లు వేయించారు. ఎన్నికల్లో వినియోగించనవి, రిజర్వులో ఉంచిన ఇవిఎంలను తరలించేందుకు ఎన్నికల కమిషన్‌కు లేఖ రాయాలని ఆర్‌డిఒను కలెక్టర్ ఆదేశించారు. ఈ తనిఖీల్లో డిఆర్ఒ ఎస్‌డి అనిత, ఆర్‌డిఒ ఎంవి సూర్యకళ, ఇవిఎంల ఇన్‌ఛార్జి బి.ఉమాశంకర్, ఎన్నికల విభాగం సూపరింటిండెంట్ భాస్కరరావు, తహశీల్దార్ సుదర్శన్, నగర పంచాయతీ కమిషనర్ అప్పలరాజు, వైసిపి నాయకులు వర్రి నర్సింహమూర్తి, సముద్రపు రామారావు, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-విజయనగరంకోట

యువత భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు అని రూరల్ సిఐ ఎం.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మాదక ద్రవ్యాల వినియోగంవల్ల కలిగే నష్టాలపై ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. గంజాయి తాగడం, గంజాయి అమ్మడం, గంజాయి కొనడం నేరమని తెలిపారు. సైబర్ నేరాలు గురించి అవగాహన కల్పించారు. కళాశాలలో ఫిర్యాదుల బాక్సు ఏర్పాటు చేసిన ఏవైనా ఫిర్యాదులు రాసి అందులో వేయవచ్చునని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ టి.వి.గిరి, ఎస్ఐ సిబ్బంది పాల్గొన్నారు

## ఇచ్చిన హామీలు అమలుచేస్తాం

### మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగార్రాజు

బంగార్రాజును సత్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేస్తుందని మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు అన్నారు. శుక్రవారం జరజాపుపేటలో బంగార్రాజు సమక్షంలో టిడిపి మండల అధ్యక్షులు కడగల ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో 19వ వార్డులో 30 కుటుంబాలు వైసిపి నుండి టిడిపిలో చేరాయి. మార్క్‌ఫెడ్ చైర్మన్‌గా నియమితులై మొదటిసారిగా గ్రామానికి వచ్చిన ఆయనకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఉత్తరాంధ్రలో మొట్టమొదటిగా జరజాపుపేటలో ప్రారంభించారు. ఈ సందర్భంగా బంగార్రాజు మాట్లాడుతూ ప్రతి కార్యకర్తా సభ్యత్వం నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సువ్వాడ రవి శేఖర్, గేదెల రాజారావు, లెంక అప్పలనాయుడు, నగర పంచాయతీ ప్రధాన కార్యదర్శి అవనాపు సత్యనారాయణ, కాళ్ళ రాజశేఖర్ అట్టాడ శ్రీధర్ ,కాళ్ళ సత్యవతి పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాలపై అప్రమత్తం

ప్రజాశక్తి-డెంకాడ

మండలంలోని అక్కివరం వద్దనున్న మోడల్ స్కూల్లో విద్యార్థులకు నూతన చట్టాలపై ఎస్ఐ ఎ.సన్యాసినాయుడు ఆధ్వర్యంలో భోగాపురం సిఐ రామకృష్ణ శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నూతన చట్టాలు తెలుసుకోవాలన్నారు. విద్యార్థులు డ్రగ్స్, గంజాయి వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. వాటి బారిన పడి భవిష్యత్తు నాశనం చేసుకోవద్దన్నారు. విద్యార్థులు లైన్స్ లైసెన్స్ లేకుండా, హెల్మెట్ ధరించకుండా మోటార్ సైకిల్ నడపరాదన్నారు. పోక్సో చట్టం తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ సిహెచ్ సంధ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

డెంకాడ.. మాట్లాడుతున్న సిఐ రామకృష్ణ

**రేగిడి :** మాదకద్రవ్యాలపై యువత, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ పొట్నూరు లీలావతి అన్నారు. ఈ మేరకు శుక్రవారం లక్ష్మీపురం గ్రామంలో సంకల్పం పేరుతో ప్రజలకు డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గంజాయి, కొకైన్, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. మత్తుకు బానిసైతే యువత జీవితాలు నాశనం అవుతాయని వెల్లడించారు. యువత భవిష్యత్తుని అంధకారం చేసుకోకుండా మంచి ప్రవర్తనతో నడవాలన్నారు.

**మెరకముడిదాం :** విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని బుదరాయవలస ఎస్ఐ లోకేశ్వరరావు సూచించారు. మండలంలోని సోమలింగాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల నష్టాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు, మహిళల రక్షణ కోసం తీసుకొనే చర్యలపై వివరించారు.

## బురదలో కూరుకుపోయిన లారీ

ప్రజాశక్తి-భోగాపురం

మండలంలో జాతీయ రహదారి నుంచి చేపలకంచేరు వెళ్లే రహదారిలో ఎ.రావివలస వద్ద శుక్రవారం మరో లారీ బురదలో కూరుకుపోయింది. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గురువారం ఒక లారీ బెర్మ దిగి బోల్తా పడిన విషయం తెలిసిందే. శుక్రవారం గుజరాత్ నుంచి భారీ పైపుల లోడుతో వస్తున్న లారీ ఎ.రావివలస పాఠశాల ఎదురుగా ఉన్న మలుపు వద్ద బురదలో కూరుకు పోయింది. విమానాశ్రయ నిర్మాణ సంస్థ ఎల్‌అండ్‌టి సిబ్బంది, పోలీసులు వచ్చి, జెసిబి సాయంతో లారీని బయటకు తీశారు.

## పోడు భూములపై ఎమ్మెల్యేకు వినతి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలోని రేగ పుణ్యగిరికి చెందిన గిరిజనులు సాగు చేస్తున్న భూములకు పోడు పట్టాలు ఇవ్వాలని ఎమ్మెల్యే లలితకుమారిని లక్కవరపుకోటలోని ఆమె నివాసంలో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే.. శృంగవరపుకోట తహశీల్దార్ అరుణకుమారితో ఫోన్లో మాట్లాడి గిరిజనుల పోడుపట్టాల సమస్యలను త్వరగా పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ ఉపాధ్యక్షులు పొట్నూరు అప్పలరాజు, రవి, మాజీ ఎంపిటిసి కన్నతల్లి, బంగారు నాయుడు, రాజేంద్ర, బత్తుల సన్యాసిరావు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో రెండు ఎద్దులు మృతి

నీటిలో దిగి విద్యుదాఘాతంతో మృతిచెందిన ఎద్దులు

ప్రజాశక్తి-బొబ్బిలి

మండలంలోని కొత్తపెంట పంట పొలాల్లో విద్యుత్తు తీగ తెగి కిందపడడంతో రెండు ఎద్దులు దుర్మరణం చెందాయి. రైతు స్వల్పంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. కొత్తపెంట గ్రామానికి చెందిన బేతనపల్లి తిరుపతి పొలం పనుల నిమిత్తం నాటుబండితో వెళ్తున్నాడు. వ్యవసాయ మోటార్లకు విద్యుత్తు సరఫరా అయ్యే తీగ తెగి పొలంలో పడింది. పొలంలో నీరు ఉండడంతో అటువైపు వెళ్తున్న నాటుబండి ఎద్దులు అందులో దిగిన వెంటనే అక్కడికక్కడే మృత్యువాత పడ్డాయి. రైతు అప్రమత్తమై నాటుబండి పైనుంచి పక్కకు దూకేశాడు. దీంతో రైతుకు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన రైతును ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు. ఎద్దులు మరణించడంతో రైతు కుటుంబసభ్యులు విలపిస్తున్నారు.

**నష్టపరిహారం ఇవ్వాలి**

విద్యుత్తు ప్రమాదంలో ఎద్దులు మరణించిన రైతుకు నష్టపరిహారం చెల్లించాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాలం డిమాండ్ చేశారు. విద్యుత్తు శాఖాధికారుల నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని తెలిపారు. విద్యుత్తు తీగలు తెగకుండా చూడాల్సిన బాధ్యత విద్యుత్తు శాఖాధికారులపై ఉన్నప్పటికీ పర్యవేక్షణ లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, రైతుకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

## రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి-రాజాం

పట్టణ రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ శుక్రవారం ప్రారంభించారు. పాలకొండ రోడ్డులో జిఎంఆర్‌ఐటి కాలేజీ సమీపంలో ప్రత్యేక పూజలు చేసి రోడ్డు పనులను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు మెయిన్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కమిషనర్ రామప్పలనాయుడు, ఆర్ అండ్ బి, తదితర ప్రభుత్వ సిబ్బంది పాల్గొన్నారు.

పొక్లెయినర్ నడుపుతున్న ఎమ్మెల్యే కోండ్రు

## బాలికల వసతిగృహంలో తనిఖీలు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పట్టణంలోని పందిరప్పన్న కూడలి సమీపంలో ఉన్న ఎస్‌సి బాలికల వసతిగృహాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.విజయ కళ్యాణి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతిగృహ వార్డెన్, సిబ్బందితో మాట్లాడి, అక్కడ కల్పిస్తున్న సదుపాయాల గురించి ఆరా తీశారు. వసతిగృహ విద్యార్థులు అస్వస్థతకు గురవడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు వైద్య సదుపాయం అందించిన వైద్యాధికారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. తహశీల్దార్‌తో కూడా మాట్లాడి, ఈ విషయంపై ఏ చర్యలు చేపట్టారని అడిగారు. భవిష్యత్తులో ఇటువంటి పరిస్థితులు ఏర్పడకుండా తగు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందిని ఆమె ఆదేశించారు. అనంతరం శృంగవరపుకోట సబ్‌జైల్‌ను న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. విజయకళ్యాణి సందర్శించారు. ఖైదీలకు కల్పిస్తున్న సౌకర్యాలు, ఉచిత న్యాయ సహాయ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి సబ్బవరపు వాణి, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే రఘురామపై ఫిర్యాదు

ప్రజాశక్తి-రేగిడి

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఫ్లెక్సీని చించిన ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజుని తక్షణమే అరెస్ట్ చేయాలని దళిత సంఘాల జెఎసి నాయకులు బొత్స బుద్ధుడు, తేగల మోహన్ రావు తదితరులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం రేగిడి ఎస్ఐ లీలావతికి ఫిర్యాదుచేశారు. ఈ సందర్భంగా దళిత నాయకులు మాట్లాడుతూ అసెంబ్లీలో అడుగు పెట్టడానికి కారణం అంబేద్కర్ కల్పించిన రాజ్యాంగమేనని రఘురామ కృష్ణంరాజు తెలుసుకోవాలని అన్నారు. కుల అహంకారంతో ఉన్న ఎమ్మెల్యేని తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బిఎస్‌పి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొత్స బుద్ధుడు, సమతా సైనిక్ దల్ మండల అధ్యక్షుడు, తేగల మోహన్, కుప్పిలి శ్రీనివాసరావు, ఎస్‌సి, ఎస్‌టి వెల్ఫేర్ లీగల్ అడ్వైజర్ బత్తిని శేఖర్, అశోక్ కుమార్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ఎస్ఐకు ఫిర్యాదు చేస్తున్న దళిత సంఘాల నాయకులు

**IN THE HONOURABLE COURT OF THE SENIOR CIVIL JUDGE AT VIZIANAGARAM.**
**E.P.No. 31/2022 in O.S.No.29/2007**

Between:-
Sri Arli Satyanarayana. ...DHR/Plaintiff.
And:-
Sri. Kappala Sanyasi and 3 others.
......JDRs/Defendants.

**NOTICE TO THE 3rd and 4th JDRs/ DEFENDANTS**

3. Sri. Kappala Venkata Rao, R/o Jhansi Nagar, V.T. Agraharam, Near "Y" Junction, Vizianagaram.
4. Sri. Kappala Paparao, S/o Sanyasi, rest -do-.

Please take notice that the above matter stands posted to 15.10.2024 for the appearance of the 3rd and 4th JDRs/defendants before the Honourable Court by 10.30 a.m. If you fail to appear before the said Honourable court by **10.30 a.m., on 15.10.2024** in person or through an advocate, the above matter will be decided in your absence and ex-parte.

**CH.V.J.A. PRASAD**
Advocate for the DHR/plaintiff.
Pradeep Nagar, Vizianagaram

**IN THE HONOURABLE COURT OF THE ADDITIONAL JUNIOR CIVIL JUDGE (EXCISE COURT) AT VIZIANAGARAM.**
**O.S.No.299/2020.**

BETWEEN
Abothula Gurunaidu ...Petitioner/Plaintiff.
AND:
Mandapati Varma Raju
.....Respondent/ Defendant.
TO.
Mandapati Varma Raju, S/o. Satyanarayana Raju, R/a. D.No.616, Rajeev Nagar Colony, Vizianagaram Town and District.

**NOTICE**

It is here by informed that the above named petitioner filed the above suit against the respondent praying the honorable court that to take summons. It is therefore informed to the above case is posted to **dt.25-10-2024** and you are informed to attend before the Honorable court on that day at **10-30 A.M.** or otherwise you will be set Ex-party.

**GORLE RAMANJANEYULU,**
Advocate,
KUMARAM, VIZIANAGARAM